భక్తిశ్రద్ధలతో నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో తిరువీధి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు రమణాచార్యులు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజు సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా తొలిసారి టికెట్లు అందుబాటులో ఉంచడంతో 50 మంది దంపతులు హోమంలో పాల్గొని తరించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి హోమగుండం వద్ద అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తరనామావళి పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు పాల్గొన్నారు.

ఘనంగా తిరునక్షత్రం పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు జరగనున్న మనవాళ్ మహా మునులు తిరునక్షత్రం పూజలను ఆదివారం పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయ వైదికులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం దివ్యప్రబంధ పారాయాణం నిర్వహించి విశేషంగా హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు అధ్యాపకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు డయల్ యువర్ డీఎం

సింహాచలం: ప్రయాణికుల సౌకర్యార్థం సలహాలు, సూచనలు స్వీకరించడానికి మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్ కె. రాజశేఖర్ తెలిపారు. 9959225592, 7382825592 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత అప్పారావుకు పరామర్శ



గొరపల్లి అప్పారావును పరామర్శిస్తున్న ముమ్మన

పెందుర్తి: అనారోగ్యానికి గురైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొరపల్లి అప్పారావును సోమవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పరామర్శించారు. గొరపల్లిలోని అప్పారావు నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బల్ల రాంబాబు, నాయకులు అంగటి సూరిబాబు, తమరాన నరసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆది, సోమవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమశాలలో శ్రీమహా గణపతి, మహా మృత్యుంజయ సహిత మహాలక్ష్మి చేశారు. పంచామృతాభిషేకం,నూతన వస్త్ర, ఆభరణ అలంకరణ జరిగాయి. గురుమాత అన్నపూర్ణమ్మ దీపావళి విశిష్టతపై భక్తులకు సందేశమిచ్చారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

నమో శివరుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని బిల్వ పత్రాలతో పూజించారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ: విజయవాడలో ఈనెల 15న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు పరవాడలో సోమవారం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు కరణం వెంకటరావు, పి.గంగరాజు, శ్రీను, పి.అప్పారావు పాల్గొన్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు



భైరవస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం: అమవాస్య పురస్కరించుకుని సోమవారం భైరవవాకలోని భైరవస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయనికి వెళ్లే రెండు కిలోమీటర్ల అటవీమార్గం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారు జాము రెండు గంటల నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. విభూదితో అర్చన చేశారు.అమృత కలశాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా దీపాలతో నిండిపోయింది.

వెన్నలపాలెంలో 15న జగనన్నకు చెబుదాం

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలోని సింహాద్రి కల్యాణ మండపంలో ఈ నెల 15న (బుధవారం) ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని తహసీల్దారు పి.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మండలంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కనకారావు కోరారు.